ఆదరించండి అందుబాటులో ఉంటా

సికింద్రాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్



పద్మారావు గౌడ్‌కు హారతి ఇస్తున్న స్థానిక మహిళలు



ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్, ఎమ్మెల్యే

అంబర్‌పేట: పార్లమెంట్ ఎన్నికల్లో తనను ఆదరిస్తే అందుబాటులో ఉండి అభివృద్ధికి కృషి చేస్తానని సికింద్రాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్ కోరారు. అంబర్‌పేట నియోజకవర్గంలోని మహంకాళి ఆలయం నుంచి ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, పార్టీ శ్రేణులతో కలిసి ఆదివారం రాత్రి ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు మాయమాటలు రావాని ఎంపీగా గెలిపిస్తే ప్రజా సమస్యల పరిష్కారానికి పాటు పడుతునాని అని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బి. పద్మావెంకట్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కె.పద్మావతిరెడ్డి, నాయకులు బి.వెంకట్‌రెడ్డి, చందు, శ్రీరాములు ముదిరాజ్, నర్సింహ రెడ్డి, రమేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

కవాడిగూడ: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ విఫలం అయ్యిందని సికింద్రాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావు గౌడ్ అన్నారు. కవాడిగూడ డివిజన్ పరిధిలోని హనుమాన్ ఆలయంలో ఎమ్మెల్యే ముఠాగోపాల్‌తో కలిసి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. అనంతరం కొత్తబజార్, మసీద్‌లేన్, ముగ్గుబస్తీ, సింగాడికుంట, ఉన్నికోట బస్తీ, చిత్రాల నగర్, భవానీనగర్, బండమైసమ్మ నగర్ తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ తిరుగుతూ ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ.. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి పనులే తనను ఎంపీగా గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. ముఠా జైసింహ, మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, డివిజన్ అధ్యక్షుడు వల్లాల శ్యామ్ యాదవ్, కొండా శ్రీధర్ రెడ్డి, వై.శ్రీనివాస్‌రావు, నగర నాయకులు మాధవ్, సుధాకర్‌గుప్తా, శివముదిరాజ్, అస్లాం, శ్రీధర్‌రెడ్డి, మాధవి, సుశీల పాల్గొన్నారు.

అభివృద్ధికి పాటుపడే బీజేపీకి ఓటు వేయండి

- సికింద్రాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి కిషన్ రెడ్డి
- నల్లకుంటలో జీపు యాత్ర



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, ఎంపీ కె.లక్ష్మణ్

నల్లకుంట: బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మాయమాటలు నమ్మవద్దని, ప్రజా సంక్షేమం, దేశాభివృద్ధికి పాటుపడే బీజేపీకి ఓటు వేయాలని కేంద్రమంత్రి, సికింద్రాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి జి. కిషన్ రెడ్డి కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నల్లకుంటలో సోమవారం జీపు యాత్ర చేపట్టారు. స్థానిక ఫీవర్ ఆసుపత్రి చౌరస్తా నుంచి హిందీ మహావిద్యాలయం, ఓయూ ఎన్‌సీసీ చౌరస్తా, శివం రోడ్డు, టీఆర్టీ కాలనీ, నర్సింహబస్తీ, న్యూరామాలయం లే బ్రాహ్మణ హాస్టల్ లేన్, తిలక్‌నగర్ మెయిన్ రోడ్డు, బతుకమ్మకుంట, తిలక్‌నగర్ బడా గణేశ్, ఇందిరానగర్, చర్చిలేన్, గోల్నాక వెజిటేబుల్ మార్కెట్ మీదుగా తిలక్‌నగర్ మహేశ్‌పాన్ షాప్, శివానంద్‌నగర్, రత్నానగర్, సత్యానగర్ వరకు సాగింది. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. దేశంలో ఏడు దశాబ్దాలుగా పేరుకుపోయిన అవినీతి, అక్రమాలు, అన్యాయాలు, బంధుప్రీతిని సరిదిద్దే పనిని మోదీ ఆధ్వర్యంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం నిబద్ధతతో చేస్తోందని చెప్పారు. 2047 నాటికి వికసిత్ భారత్, మోదీ గ్యారంటీతో ముందుకు పోతున్నామని వివరించారు. రెండు దశాబ్దాలుగా అంబర్‌పేట నియోజకవర్గ ప్రజలు తనను కుటుంబ సభ్యుడిగా ఆదరిస్తున్నారని, ఈ పార్లమెంట్ ఎన్నికల్లోనూ మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. యాత్రలో మాజీ మంత్రి సి. కృష్ణయాదవ్, నల్లకుంట మాజీ కార్పొరేటర్ వనం రమేశ్, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కాచిగూడ డివిజన్‌లో..

కాచిగూడ: కాచిగూడ డివిజన్‌లో కార్పొరేటర్ కన్నె ఉమా రమేశ్ యాదవ్‌తో కలిసి సికింద్రాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ గత నాలుగున్నర సంవత్సరాల్లో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి ఎంతో కృషి చేశానని, ఇటీవల తాను చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను బుక్‌లెట్ ద్వారా ప్రజల ముందు ఉంచానని తెలిపారు. మరోసారి బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు కన్నె ఉమా రమేశ్ యాదవ్, సి.కృష్ణ యాదవ్, కృష్ణ కుమార్, సుభాష్ పటేల్, నందకిశోర్ యాదవ్, శ్రీసాగర్, అశోక్ కులకర్ణి, ఎం.నర్సింగ్ రావు, మురళి, వాసు, దిలీప్, బల్వీర్, మల్లికార్జున్, రాజ్‌కుమార్, శాంతాబాయి, సారిక, తారా, లావణ్య, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కాచిగూడ రోడ్‌షోలో కిషన్‌రెడ్డితో కార్పొరేటర్ కన్నె ఉమా రమేశ్ యాదవ్

రాష్ట్రంలో బీజేపీకి మంచి వాతావరణం

ముషీరాబాద్: రాష్ట్రంలో బీజేపీకి అనుకూల వాతావరణం ఉందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ముషీరాబాద్‌లో ఏర్పాటు చేసిన సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ నియోజకవర్గ ఎన్నికల కార్యాలయాన్ని డాక్టర్ కె.లక్ష్మణ్‌తో కలిసి సోమవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ముషీరాబాద్ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ రమేశ్‌రాం అధ్యక్షతన సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే 30 శాతం ప్రచారాన్ని పూర్తి చేశామని, ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తుందని, నరేంద్రమోదీని మరోసారి ప్రధానమంత్రిని చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ కిషన్‌రెడ్డి గెలుపు ఖాయమయ్యిందని, కేవలం మెజార్టీ కోసం ఆలోచించాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత రాష్ట్ర రాజకీయాల్లో అనేక మార్పులు జరుగుతాయన్నారు. రేవంత్‌రెడ్డి వంద రోజుల పాలన మాటలకే పరిమితం అయిందని , ఇచ్చిన హామీలు విస్మరించారని మండిపడ్డారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూసరాజు, కార్పొరేటర్లు సుప్రియానవీన్‌గౌడ్, రవిచారి, రచనశ్రీ, పావని వినయ్‌కుమార్, మహంకాళీ జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు సదానంద్ ముదిరాజ్, విశ్వం, జమాల్‌పురి నందు, నాయకులు శేషసాయి, రాంరెడ్డి, శివాజీ, భరత్‌గౌడ్, బండారు రాధిక తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన శివసేన, బీఆర్ఎస్ నేతలు..

ముషీరాబాద్‌లో జరిగిన సభలో ముషీరాబాద్‌కు చెందిన శివసేన పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బిజ్జి రవి, నగర కార్యదర్శి కృష్ణచారి, ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు నర్సింగ్‌ప్రసాద్, నాయకులు బుజ్జి వెంకటేశ్, బొమ్మిడి వీర స్వామి, డేవిడ్, వాసు తదితరులు ముషీరాబాద్ డివిజన్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరగా కిషన్‌రెడ్డి, లక్ష్మణ్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

చిన్న చిత్రాలను ఆదరించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, నితీశ్‌ముదిరాజ్

ముషీరాబాద్: సామాజిక దృక్పథంతో నిర్మించే చిన్న చిత్రాలను ఆదరించి ప్రోత్సహించాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ సూచించారు. కె.నితీశ్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్మించిన షాట్ మూవీ ఇటలీ పేరుతో నిర్మించిన యదార్థ ప్రేమ కథ పోస్టర్‌ను ముషీరాబాద్‌లో సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిజమైన ప్రేమ కథను ఆధారంగా తీసుకొని రూపొందించిన ఈ సినిమా ప్రజాధారణ పొందాలని ఆకాంక్షించారు. ప్రేమ పేరుతో సూసైడ్ చేసుకోవడం మానుకోవాలని, పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో షాట్ మూవీ నిర్వాహకులు రాజా దీన్‌దయాల్‌రెడ్డి, నవీన్ కుమార్, మనోజ్‌గౌడ్, ప్రసాద్, సాయికిరణ్, జెస్టిన్, అఖిలేష్, సుజిత్, ప్రవీణ్, హేమాచక్రధర్‌రెడ్డి పాల్గొన్నారు.

మెజార్టీ ఓట్లు సాధిస్తాం



దానం నాగేందర్‌ను సత్కరిస్తున్న అంబర్‌పేట నేతలు

అంబర్‌పేట: అంబర్‌పేటలో కాంగ్రెస్ పార్టీకి మెజార్టీ ఓట్లు వచ్చేలా పని చేస్తామని ఆ పార్టీ నేతలు అన్నారు. అంబర్‌పేటకు చెందిన పలువురు మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, దానం నాగేందర్‌ను ఆయన నివాసంలో సోమవారం కలిసి సత్కరించారు. మాజీ కార్పొరేటర్ దిడ్డి రాంబాబు, పులి జగన్, సీనియర్ నాయకులు గరిగంటి రమేశ్, తలుపునూరి కృష్ణగౌడ్, బండ సూరి, శ్రీమంత్‌గౌడ్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు



సమసలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట: బస్తీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారంలో అధికారులు జాప్యం చేయవద్దని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ సూచించారు. గోల్నాక డివిజన్ అన్నపూర్ణనగర్‌లో లోప్రెషర్ సరఫరా, కలుషిత నీటి సమస్యతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలుసుకున్న ఆయన సోమవారం ఉదయం ఆ ప్రాంతంలో పర్యటించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

నాలా విస్తరణ పనుల నిర్లక్ష్యంపై నిరసన



బాక్స్ నాలా విస్తరణ పనులు చేపట్టాలని నిరసన తెలుపుతున్న కాలనీవాసులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అడిక్‌మెట్ డివిజన్ పద్మ కాలనీలోని గురుదత్త స్కూల్ లేన్‌లో ఇరుపక్కల బాక్స్ నాలా విస్తరణ పనులు చేపట్టకపోవడంతో ఆ కాలనీ నాలా బాధితుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం కన్వీనర్ టి.రితీశ్‌కుమార్, శ్రీకాంత్ మాట్లాడుతూ బాక్స్ నాలా విస్తీర్ణ పనులు చేపట్టాలని గతంలోనే ఎమ్మెల్యే ముఠా గోపాల్ సంబంధిత అధికారులను ఆదేశించారన్నారు. అయినప్పటికీ జీహెచ్ఎంసీ సిబ్బంది పనులు పూర్తికాకుండానే గోడ కట్టేందుకు ప్రయత్నించడంతో అడ్డుకొని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశామన్నారు. దీంతో వెంటనే ఎమ్మెల్యే అక్కడికి చేరుకొని బాక్స్ నాలా విస్తీర్ణ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు. అయితే మళ్లీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తే ఎలా అని ఎమ్మెల్యేను వారు ప్రశ్నించారు. కార్యక్రమంలో నాలా బాధితుల అసోసియేషన్ నాయకులు రూపా, సునీత, దీపిక, వసంత తదితరులు పాల్గొన్నారు.

సామూహిక ఉపనయనం కార్యక్రమం



సామూహిక ఉపనయనం నిర్వహిస్తున్న దృశ్యం



కార్యక్రమంలో పాల్గొన్న విశ్రాంత చీఫ్ జస్టిస్ భాస్కర రావు

నల్లకుంట: తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కె. సురేశ్ చందర్‌రావు ఆధ్వర్యంలో కర్మన్‌ఘాట్ టీకేఆర్ కళాశాల సమీపంలోని అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం సామూహిక ఉపనయనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా కర్ణాటక హైకోర్టు రిటైర్డు చీఫ్ జస్టిస్ భాస్కర్ రావు హాజరై ప్రముఖ ప్రవచకురాలు ప్రొఫెసర్ డాక్టర్ అనంత లక్ష్మితో కలిసి మాట్లాడారు. ఉపనయనం అయ్యేవరకు పురుషుడు స్వయంగా ఎలాంటి ధర్మకార్యం నెరవేర్చేందుకు అర్హుడు కాదన్నారు. యజ్ఞయాగాది క్రతువులు నెరవేర్చాలంటే ఉపనయనం చేసుకున్న తర్వాతనే అర్హత వస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి బ్రాహ్మణ బాలురులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. టీబీఎస్ఎస్ ప్రతినిధులు రాజమోహన్, బల్వంత రావు, అశోక్ కుమార్, అమిత్ దేశ్‌పాండే, సౌజన్య దేశ్‌పాండే, సీహెచ్. మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చోరీకేసు నిందితుల అరెస్టు

- రూ.6 లక్షల విలువైన ఆభరణాలు, 3 బైక్‌లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన చిక్కడపల్లి ఏసీపీ ఎల్.రమేశ్‌కుమార్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రమేశ్‌కుమార్

చిక్కడపల్లి: ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని ఆలయంలో చోరీ చేసిన నిందితులను చిక్కడపల్లి పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 6 లక్షల విలువైన సొత్తుతో పాటు మూడు బైక్‌లు స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు. చిక్కడపల్లి ఏసీపీ ఎల్.రమేశ్‌కుమార్ చిక్కడపల్లి పీఎస్‌లో ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య, ఎస్ఐలు నాగరాజు, కోటేశ్వరరావు, శౌపాల్‌రెడ్డి, మౌనికతో కలిసి సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గాంధీ ఆసుపత్రి ఫుట్‌పాత్‌పై నివసిస్తూ లేబర్ పని చేసే భూపాల్‌పల్లికి చెందిన పాత నేరస్తుడు రాజశేఖర్ (19) సెకండ్ షో సినిమా చూసి వస్తూ ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని పంచముఖ హనుమాన్ ఆలయంలో చోరీ చేయాలని భావించాడు. గత ఫిబ్రవరి 9వ తేదీ రాత్రి ఆలయంలోకి చొరబడి ఆభరణాలు, పంచలోహ విగ్రహాలు ఎత్తుకెళ్లాడు. ఆ సొత్తును ట్రాలీలో దాచిపెట్టగా భోలక్‌పూర్‌కు చెందిన మహ్మద్ ఆసిఫ్ (28), ఇస్మాయిల్ హుస్సేన్ (23) అందులోని దేవతామూర్తుల విగ్రహాలను దొంగిలించారు. అయితే వారిద్దరిని అదే నెల 23న చిక్కడపల్లి పోలీసులు అరెస్టు చేసి సొత్తును రికవరీ చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా సోమవారం చిక్కడపల్లి మెట్రో స్టేషన్ వద్ద చోరీ చేసిన బైక్‌పై వెళ్తున్న ప్రధాన నిందితుడు రాజశేఖర్ పోలీసులను చూసి పారిపోతుండగా అదుపులోకి స్టేషన్‌కు తరలించి విచారించారు. తాను గత ఫిబ్రవరి 9న ఆర్టీసీ క్రాస్ రోడ్ పంచముఖ హనుమాన్ ఆలయంలో చోరీ చేసిన విషయాన్ని నిందితుడు ఒప్పుకున్నాడు. కాగా ముషీరాబాద్, చిక్కడపల్లి పీఎస్‌ల పరిధిలో చోరీ చేసిన మూడు బైక్‌లు, సొత్తును నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్నారు. చోరీ చేసిన సొత్తును ఇతరులకు అమ్మిపెట్టిన భోలక్‌పూర్‌కు చెందిన ముబ్బాషీర్ మొహియుద్దీన్ (23), మహ్మద్ ఖలీద్ అహ్మద్ (31)లను కూడా అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. కేసును ఛేదించిన సిబ్బందిని ఏసీపీ ప్రత్యేకంగా అభినందించారు.

నేడు అన్నదానం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: హనుమాన్ జయంతి సందర్భంగా చిక్కడపల్లిలోని వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద ఈ నెల 23న (నేడు) అన్నదానం నిర్వహించనున్నట్లు శ్రీ బాలాజీ భక్త సమాజం సభ్యులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని అధ్యక్షుడు పలుస బాలరాజ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి డి.చంద్రమోహన్‌గౌడ్, ఉపాధ్యక్షులు పి.రామాచారి, శివకుమార్, ఉదయ్‌కుమార్‌గుప్తా, శంకర్ కోరారు.

హనుమాన్ విజయయాత్ర

ముషీరాబాద్: హనుమాన్ జయంతి సందర్భంగా ఈ నెల 23న (నేడు)మంగళవారం సాయంత్రం 6 గంటల నుంచి అడిక్‌మెట్ ఆంజనేయ స్వామి ఆలయం నుంచి వీర హనుమాన్ విజయ యాత్ర చేపట్టనున్నట్లు నిర్వాహకుడు గడ్డం నవీన్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాంనగర్, ముషీరాబాద్ చేపల మార్కెట్, దాయర మార్కెట్, బాకారం, హరినగర్ వరకు యాత్ర సాగుతుందని, యువకులు, హిందూ బాంధవులు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

28న డ్యాన్స్ ఫెస్ట్ 2024

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఈ నెల 28న ప్రపంచ నృత్య దినోత్సవాన్ని పురస్కరించుకొని స్ఫూర్తి మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో డ్యాన్స్ ఫెస్ట్–2024 కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు అకాడమీ డైరెక్టర్, కొరియోగ్రాఫర్ సూర్యతేజ సుబ్రాంత్ మాస్టర్ సోమవా రం ఓ ప్రకటనలో తెలిపారు. బాగ్‌లింగంపల్లిలో ని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మ 2 నుంచి సా.6 గంటల వరకు కొనసా గనున్నట్లు పేర్కొన్నారు. 6 ఏళ్ల నుంచి 60 సంవత్సరాల వయస్సు గల నాట్య కళాకారులు కూచిపూడి, భరత నాట్యం, కథక్, పేరిని నాట్యం, దేశభక్తి, జానపద, సినిమా, సోలో, డ్యూయేట్ తదితర ప్రదర్శనలు ఇవ్వచ్చని తెలిపారు. వివరాలకు 9963222040ను సంప్రదించాలని ఆయన సూచించారు.

నేటి నుంచి బైబిల్ తరగతులు

చిక్కడపల్లి: గోల్కొండ చౌరస్తాలోని హెబ్రోన్ చర్చిలో ఈ నెల 23 (నేటి) నుంచి 12 రోజుల పాటు పిల్లలు, యువతీ యువకులకు ప్రత్యేకమైన బైబిల్ తరగతులు నిర్వహించనున్నట్లు హెబ్రోన్ సొసైటీ చైర్మన్, దేవసేవకులు జోసెఫ్ పి.కురియన్, సొసైటీ ప్రధాన కార్యదర్శి, సొసైటీ ఆఫ్ ట్రస్టీస్ ఆఫ్ ఇండిజినస్ చర్చస్ ఇన్ ఇండియా ప్రధాన కార్యదర్శి పీటర్ రాగి వీరాచారి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కేజీ నుంచి పీజీ విద్యార్థులు, యువకులకు యేటా వేసవిలో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతిరోజు ఉదయం 7.30 నుంచి 10.30 వరకు కొనసాగుతాయని తెలిపారు.

రేపు గోపాల్ రెడ్డి కరాటే ప్రదర్శన

కాచిగూడ: జీవీఆర్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో మాస్టర్ డాక్టర్ జి.ఎస్.గోపాల్‌రెడ్డి ఈ నెల 24వ తేదీన ఉదయం 7 గంటలకు కాచిగూడలోని జీవీఆర్ కరాటే అకాడమీలో ప్రదర్శనలు చేయనున్నారు. 24 సెకన్లలో 24 కిక్‌లతో 24 నాపరాళ్లను పగులగొట్టి వరల్డ్ రికార్డు చేయనున్నట్లు అకాడమీ అసిస్టెంట్ డైరెక్టర్ అమృతా రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 24 వరల్డ్ రికార్డ్స్ సంస్థల ప్రతినిధులు పాల్గొని రికార్డ్‌ను నమోదు చేసుకుని వరల్డ్ రికార్డ్స్ సర్టిఫికెట్స్, మెడల్స్‌ను గోపాల్‌రెడ్డికి అందజేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎస్ఆర్‌డీ సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

ముషీరాబాద్: ఉచిత ఉపాధి శిక్షణ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్(ఎస్ఆర్‌డీ) డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. ముషీరాబాద్ డివిజన్‌లోని రాంనగర్‌లో గల ఎస్ఆర్‌డీ కార్యాలయంలో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి రంగంలో శిక్షణ పూర్తి చేసుకున్న 100 మంది విద్యార్థులకు సోమవారం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ తీసుకోవాలనుకునేవారు ఫోన్ నంబర్ 9052485742లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు క్రాంతికిశోర్, రజిని, నీలకంఠ, పవిత్ర, రమణి, ఇందిరా భారతి, వెంకటేశ్వరీ పాల్గొన్నారు.

మనస్సుకు హత్తుకునేవి లలిత గీతాలు



గీతాలు ఆలపిస్తున్న గాయనీగాయకులు

చిక్కడపల్లి: మనస్సుకు హత్తుకునేవి లలిత గీతాలు అని రాష్ట్ర ట్రెజరీస్, అంకౌంట్స్ డిప్యూటీ డైరెక్టర్ జి.వసుంధర అన్నారు. నవ్యనాటక సమితి ఆధ్వర్యంలో త్యాగరాయగానసభలో ప్రముఖ లలిత సంగీత గాయని ఏవీ సావిత్రీ స్మార్మిక లలిత గీతాలు పోటీల రజోత్సవ వేడుకలు సోమవారం రాత్రి జరిగాయి. ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. లలిత గీతాలకు ఆకాశవాణి ఎంతో ప్రాముఖ్యం ఇచ్చిందన్నారు. సంగీత కళాకారులు తాడేపల్లి లోకనాథశర్మ , ఆనందమోహన్ విజేతలకు బహుమతులు అందజేశారు. లలిత గీతాల రచయిత, గాయకుడు కృష్ణమోహన్, గాయని సురేఖ, శశికళాస్వామి, ఆచార్య ఫణీంద్ర, సంస్థ అధ్యక్షుడు వేమరాజు విజయకుమార్ పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొనేందుకు శ్రీలంకకు పయనం



బయలుదేరి వెళ్తున్న క్వీని విక్టోరియా

కాచిగూడ: స్విమ్మింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి నిర్వహించనున్న రిలే స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొనేందుకు బర్కత్‌పురకు చెందిన గంధం క్వీని విక్టోరియా సోమవారం శ్రీలంకకు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్విమ్మింగ్ పోటీలకు ఎంపికవ్వడం సంతోషంగా ఉందని, సరికొత్త రికార్డు నెలకొల్పి భారత కీర్తి ప్రతిష్ఠలను చాటిచెబుతానని ధీమా వ్యక్తం చేశారు. కాగా ఆమె శ్రీలంకలోని తలైమినార్ నుంచి తమిళనాడులోని ధనుస్కోటి వరకు, మళ్లీ తిరిగి తలైమినార్ వరకు సుమారు 33 కిలోమీటర్లు బంగాళఖాతంలో స్విమ్మింగ్ చేయనున్నది. భారత్ నుంచి ఆరుగురు ఎంపిక కాగా, అందులో క్వీని విక్టోరియా ఒకరు. కోచ్ దినేశ్ రజోరియా ఆధ్వర్యంలో ఆమె శిక్షణ తీసుకున్నది.

బ్యాగ్ చోరీపై జీరో ఎఫ్ఐఆర్ నమోదు

కాచిగూడ: బ్యాగు చోరీపై జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపారు. మెదక్ జిల్లా తుప్రాన్‌కు చెందిన సీహెచ్ నరేశ్ గౌడ్ కుటుంబ సభ్యులతో కలిసి నాగర్‌సోల్ ప్రత్యేక రైలులో ఆదివారం నెల్లూరు నుంచి కాచిగూడకు వస్తున్నారు. నల్గొండ రైల్వే స్టేషన్ వద్ద ఉండగా 8 గ్రాముల వెండి పట్టీలు, స్మార్ట్ వాచ్, రూ.500 నగదు ఉన్న బ్యాగు చోరీకి గురైంది. సోమవారం బాధితుడు కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న రైల్వే పోలీసులు తదుపరి విచారణ కోసం కేసును నల్గొండ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు.

బంగారు ఆభరణాల చేతి బ్యాగు చోరీపై ..

బంగారు ఆభరణాల చేతి బ్యాగు చోరీపై జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపారు. అల్వాల్‌కు చెందిన శ్రవంత్ తన భార్య శ్వేతతో కలిసి ఆదివారం నాగర్‌సోల్ నుంచి కాచిగూడకు అజంతా ఎక్స్‌ప్రెస్ రైలులో వస్తున్నాడు. రైలు ముత్కేడ్ రైల్వే స్టేషన్ వద్ద ఆగగా 20 గ్రాముల బంగారు నెక్లెస్, 10 గ్రాముల బంగారు గొలుసున్న చేతి బ్యాగును ఆగంతకుడు లాక్కుని పారిపోయాడు. సోమవారం బాధితురాలు కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి తదుపరి విచారణ కోసం కేసును నాందేడ్ రైల్వే పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేసినట్లు రైల్వే ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఘనంగా లెనిన్ జయంతి

ముషీరాబాద్: విద్యానగర్‌లోని న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యాలయ మార్క్స్ భవన్‌లో మార్క్సిస్ట్ లెనిన్ జయంతి, సీపీఐఎంఎల్ ఆవిర్భావం సందర్భంగా సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జె.వి.చలపతిరావు సోమవారం అరుణపతాకాన్ని ఎగురవేసి సభను నిర్వహించారు. సభలో ఐఎఫ్‌టీయూ జాతీయ నాయకులు బి.ప్రదీప్, పీవోడబ్ల్యూయూ రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీ, అరుణ, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్యామ్ తదితరులు పాల్గొని మాట్లాడారు. అలాగే మాస్‌లైన్ ఆధ్వర్యంలోనూ నిర్వహించారు. మాస్‌లైన్ సెక్రటేరియట్ సభ్యులు, గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి ఎం.అన్మేష్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం, నగర అధ్యక్షుడు ఎస్.ఎల్.పద్మ పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో రుద్రహోమం

చిక్కడపల్లి: వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా సోమవారం రుద్రహోమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఈనెల 23వ తేదీన హనుమాన్ జయంతి సందర్భంగా ఉదయం మన్యు సూక్తపూర్వక శతకలశాభిషేకం, సాయంత్రం సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో ఎం.దేవనాథం, ప్రధాన అర్చకుడు బుగ్గా లక్ష్మీపతిశర్మ తెలిపారు. అదేవిధంగా ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని ప్రసిద్ధ శ్రీ లక్ష్మీగణపతి ఆలయంలో కూడా హనుమాన్ జయంతి, వ్రతాలు నిర్వహించనున్నట్లు ఈవో పి.లక్ష్మారెడ్డి, అర్చకుడు ఇ.కాశీనాథశర్మ తెలిపారు.

ప్రశాంతంగా జరుపుకోవాలి

ముషీరాబాద్: హనుమాన్ జయంతిని ప్రశాంతంగా జరుపుకోవాలని పీస్ కమిటీ చైర్మన్ ముక్తార్ హుస్సేన్ కోరారు. సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నగరంలో తమ కార్యకర్తలు పోలీసులకు సహకరిస్తూ వలంటీర్లుగా పని చేస్తారని తెలిపారు.

నియామకం



ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గ బీజేపీ జాయింట్ కన్వీనర్‌గా రాంనగర్ డివిజన్‌కు చెందిన సీనియర్ నాయకుడు ఎం.ఎన్.రఘునాథ్ నియామకమయ్యారు. బీజేపీ జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కె.లక్ష్మణ్ నియామక పత్రాన్ని సోమవారం ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ పదవి ఇచ్చినందుకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి, ఎంపీ కె.లక్ష్మణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో కిషన్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేస్తానని తెలిపారు.

అలరించిన సినీసంగీత విభావరి

చిక్కడపల్లి: శ్రీ మహాలక్ష్మి మెలోడీస్ ఆధ్వర్యంలో మధు గాయని జానకి పుట్టిన రోజును పురస్కరించుకొని త్యాగరాయగానసభలో సోమవారం రాత్రి గాయని మహాలక్ష్మి సమక్షంలో నిర్వహించిన సినీసంగీత విభావరి అలరించింది. గాయనీగాయకులు పాల్గొని జానకి ఆలపించిన గీతాలను శ్రవణానందంగా ఆలపించారు. ఈ సందర్భంగా సినీ నేపథ్య విజయలక్ష్మికి తెలుగు బుక్ ఆఫ్‌రికార్డు, ఎక్సలెన్స్ అవార్డు, జానకి పురస్కారాన్ని ప్రదానం చేసి సన్మానించారు. వినోద్‌గౌడ్, మురళీధర్, లక్ష్మీనారాయణ, దైవజ్ఞశర్మ, రాఘవరెడ్డి, ఓంకార్‌రాజు, రాయుడు, ఆదిత్యప్రసాద్ పాల్గొన్నారు.